క్లుప్తంగా

సాయిబాబా ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనన్

దక్కిలి: మండలంలోని చాపలపల్లిలో సాయిబాబా ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని గురువారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనన్, తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు పరిశీలించారు. గ్రామానికి చెందిన ఎ.సుబ్బారావు సర్వే నంబర్ 21-19, 20, 21లో వున్న 74 సెంట్ల వ్యవసాయ భూమిని ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఆ భూమిని వ్యయసాయేతరంగా మార్చాలని ఇటీవల సుబ్బారావు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనన్ భూమని పరిశీలించి త్వరలో సాయిబాబా ఆలయానికి పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా


కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ అధ్యక్షతన నిర్వహించాల్సిన కౌన్సిల్ అత్యవసర సమావేశం వాయిదా పడింది. సమావేశానికి ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వారు రాలేదు. కోరం లేకపోవడంపై సమావేశాన్ని వాయిదా వేసినట్టు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ జాతర


అలంకరణలో పోలేరమ్మ

వెంకటగిరి రూరల్ : మండలంలోని పాలకొండసత్రం గ్రామంలో గురువారం పోలేరమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడేళ్ల క్రితం గ్రామంలో పోలేరమ్మ జాతర జరుపుకున్నారు. తర్వాత ఈ ఏడాది జాతరను అత్యంత వైభవంగా చేపట్టారు. జాతర సందర్భంగా గ్రామంలో మూడు రోజులుగా విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. గురువారం తెల్లవారు జామున నుంచి అమ్మవారిని వేపాకు తోరణాల మధ్య ఆలయంలో కొలువుదీర్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

బ్యాంకుల్లో భద్రతపై చర్యలు


సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

తడ: బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాలను సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పరిశీలించారు. హిందూపూర్‌లోని బ్యాంకులో జరిగిన దొంగతనం నేపథ్యంలో తడ, సూళ్లూరుపేటలో బ్యాంకులను సందర్శించారు. బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన అలారాలు, సీసీ కెమెరాల పని తీరు, గార్డులు ఇతరాలను పరిశీలించారు. అనంతరం అన్ని బ్యాంకుల మేనేజర్లతో తడ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. సీఐ వెంట తడ ఎస్‌ఐ కొండపనాయుడు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

ఎంఈఓ-1 నాగేశ్వరరావు


నాగేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి ఎంఈఓ-1గా నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు ధనుంజయనాయుడు, రమేష్‌బాబు, దేవేంద్ర, పెరిమిడి పీవీ రత్నయ్య, కిరణ్, చెంచురత్నం యాదవ్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు 1.8.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	121
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	244
లేయర్ చికెన్	:	190

సచివాలయాలు నిర్వీర్యం

ప్రజలకు ప్రతి సేవ క్షేత్ర స్థాయిలోనే అందించే విధంగా గత ప్రభుత్వం గ్రామ సచివాలయం వ్యవస్థను తీసుకొచ్చింది. విప్లవాత్మకంగా అందరికీ సేవలందించి దేశం మనవైపు చూసేలా కృషి చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తీవ్ర సిబ్బంది కొరతతో సచివాలయాల సేవలు గ్రామాల్లోని రైతులు, ప్రజలకు అందని ద్రాక్షలా మారాయి. ఇటీవల సచివాలయాల్లో పలు శాఖల సిబ్బంది బదిలీలపై వెళ్లిపోవడంతో ప్రజలకు అందే సేవలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రతి సచివాలయంలో 11 శాఖలకు చెందిన సిబ్బంది ఉండాలి. కానీ ప్రస్తుతం అరకొరగా సచివాలయాల్లో సిబ్బంది ఉండడంతో వివిధ సేవల కోసం ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. – దొరవారిసత్రం


పోలిరెడ్డిపాలెం గ్రామ పరిధిలో ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు

- పలు సచివాలయాల్లో సిబ్బంది కొరత
- అందుబాటులోలేని పలు శాఖల సిబ్బంది
- నానా అగచాట్లు పడుతున్న రైతులు, ప్రజలు

దొరవారిసత్రం మండలం పరిధిలో 22 పంచాయతీలకు 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 65 గ్రామాల్లో 39,500 మంది జనాభా ఉన్నారు. ప్రతి సచివాలయంలో 11 శాఖలకు చెందిన 132 మంది సిబ్బంది ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం 94 మంది సిబ్బంది మాత్రమే ఉండడంతో వివిధ సేవల కోసం విచ్చేసే రైతులు, ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. సకాలంలో సేవలు అందక సచివాలయం, మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు. 22 మంది కార్యదర్శులకుగాను ప్రస్తుతం 12 (గ్రేడ్ 1-5 కార్యదర్శులు) మంది ఉన్నారు. అదేవిధంగా 11 గ్రామ సచివాలయాల్లో 11 శాఖలకు చెందిన సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. తాజాగా బదిలీలైన తరువాత డిజిటల్ అసిస్టెంట్లు 7, మహిళా పోలీసుల 10, వెల్ఫేర్ అసిస్టెంట్లు 07, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు 6, ఉద్యానవన శాఖ సిబ్బంది 1, ఇంజినీరింగ్ అసిస్టెంట్ 5, విలేజ్ సర్వేయర్లు 6, వీఆర్‌ఓలు 6, వెటర్నరీ అసిస్టెంట్ 9, ఏఎన్‌ఎంలు 10 ఉన్నారు. సెరీ కల్చర్, మత్స్య శాఖలకు సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు.

పది సేవలు కూడా అందడం లేదు

గ్రామ సచివాలయాల ద్వారా 536 సేవలు అందేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టి ప్రతి శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పట్టుమని పది సేవలు కూడా సచివాలయాల్లో అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపని కోసం వెళ్లినా ఆయా శాఖ సిబ్బంది అందుబాటులో లేనందున ఒకటికి పదిసార్లు తిరిగినా ప్రయోజనం లేకపోవడంలో మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తుంది. మరి కొన్ని సేవలకు అయితే మీసేవ కేంద్రాలకు వెళ్లి వందల రూపాయలు వెచ్చించి పనులు చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి కొన్ని సచివాలయాల్లో డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు లేనందున కులం, ఆదాయం, 1బీ, అడంగల్, టైటిల్ డీడ్ రెవెన్యూ పరమైన కీలమైన సేవలు సైతం సచివాలయాల్లో అందాల్సి ఉంది. కానీ ఈవేవీ అందకపోవడంతో చిన్నపాటి పనులకు సైతం మండల కార్యాలయాలకు వెళ్లక తప్పడం లేదని పలువురు బాధితులు వాపోతున్నారు.

ఇన్‌చార్జ్‌లతో సరి

గ్రామ సచివాలయాల్లో ఉండాల్సిన సిబ్బంది పూర్తిగా లేకుండా పోవడంతో ఇన్‌చార్జిలతో సరిపెడుతున్నారు. దీంతో ఆయా శాఖల సిబ్బంది ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొనడంతో వివిధ రకాల పనులపై సచివాలయాలకు విచ్చేసే రైతులు, ప్రజలు రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాలన కుంటుపడుతోంది.

సచివాలయంలో సేవలు అందడం లేదు



గ్రామ సచివాలయంలో గతంలో మాదిరి ఇప్పుడు సేవలు అందడం లేదు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు కోసం సచివాలయానికి వెళ్లినా సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండడం లేదు. దీంతో చేసేది ఏమీ లేక మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది.

– సోమయ్య, పోలిరెడ్డిపాలెం గ్రామం

ఏ పని కోసమైనా తిరగాల్సి వస్తుంది



ఏ పని కోసమైన సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతంలో అయితే గ్రామ వలంటీర్లు ప్రతి సేవ కాని, సర్టిఫికెట్లు కానీ మా ఇంటి వద్దకు తీసుకొచ్చి అందజేసేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లినా సరైన సమాచారం చెప్పేవారు సైతం కరువయ్యారు. సచివాలయంలో సిబ్బంది కొరత కారణంగా పనులు సక్రమంగా జరగడం లేదు.

– సుందరయ్య, ఏకొల్లు గ్రామం

ముందుచూపుతోనే గ్రామ సచివాలయాలు



మండలం కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ ప్రజలు, రైతులు పనులకు తిరిగే పని లేకుండా జగనన్న ముందుచూపుతో గ్రామ సచివాలయాలను తీసుకువచ్చి ప్రతి సేవ క్షేత్ర స్థాయిలో అందే విధంగా కృషి చేశారు. ఈ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కుంటి సాకులు చెప్పుకుంటూ నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. దీంతో ప్రజలు, రైతులకు కష్టాలు తప్పవు.

– అల్లూరు రాహుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, దీవీ సత్రం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్ని సచివాలయాల్లో ప్రతి శాఖ సిబ్బంది ఉండే విధంగా చర్యలు చేపడతాం. ప్రస్తుతం 11 గ్రామ సచివాలయాల్లో 94 మంది ఉన్నారు.

– కె.గోవర్ధన, ఎంపీడీఓ, దీవీ సత్రం

మట్టి తవ్వకాలు ఆపాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అశ్విన్‌రెడ్డి

చిట్టమూరు: అనుమతులు లేకుండా మండలంలోని యల్లసిరి చెరువులో కూటమి నేతలు అక్రమంగా తవ్వి తరలిస్తున్న మట్టిని ఆపాలని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ కల్చరల్ వింగ్ కన్వీనర్ వాకాటి అశ్విన్‌రెడ్డి గురువారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మేజర్ చెరువు యల్లసిరిలో నాలుగు హిటాచీలు పెట్టి 20 టిప్పర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకవడం లేదని ఆరోపించారు. ఈ చెరువు కింద 3 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. గత వారం రోజుల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా మట్టి తరలించి కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు ఆపకుంటే వైఎస్సార్‌సీపీ ఆందోళన బాట పడుతుందని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి


ఎస్‌బీఐ బ్యాంకును పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరురూరల్: బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి సూచించారు. గూడూరు ఒకటవ, రెండో పట్టణ పరిధిలో ఉన్న బ్యాంకులను గురువారం పరిశీలించారు. బ్యాంకు సిబ్బందితో చర్చించి భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పలు విషయాలను తెలియజేశారు. సీఐలు శ్రీనివాస్, శేఖర్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు. అనంతరం సెయింట్ మేరిస్ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీల నిరసన


సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరసన

తడ: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, వినతిపత్రం అందించారు. సూళ్లూరుపేట ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎం.హైమావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు పనిభారం పెరుగుతోందన్నారు. పింఛన్ల పంపిణీని అంగన్‌వాడీలపై మోపడం దారుణమన్నారు. సమస్యలపై ఎంపీడీఓ శేఖర్ నాయక్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, సుధాకర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా అడ్డుకోలేరు

చిట్టమూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా జనప్రవాహాన్ని అడ్డుకోలేక పోయారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. నెల్లూరుకు వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి కలుసుకునేందుకు వెళ్లిన తమ కారును ఆపడంతో నడుచుకుంటూ వెళ్లామని తెలిపారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, పేట రాజీవ్‌రామిరెడ్డి, దువ్వూరు రఘునాథ రెడ్డి, గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, బిరియానీ మస్తాన్, ఆబాక కార్తీక్‌రెడ్డి, గిరిరెడ్డి పాల్గొన్నారు.


గునపాడులో స్కౌట్ యూనిట్


స్కౌట్ యూనిట్ ప్రారంభించిన భూపయ్య

చిట్టమూరు: మండలంలోని గునపాడు జెడ్పీ హైస్కూల్లో గురువారం స్కౌట్ యూనిట్‌ను ఎంఈఓ-2 బత్తిన భూపయ్య ప్రారంభించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నతనం నుంచి స్కౌట్‌లో చేరడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో చిక్కుకున్న వారికి ఎలా వైద్యం చేయాలో స్కౌట్ నైపుణ్యాలను నేర్పుతాయని తెలిపారు. విద్యార్థులు చిన్న తనం నుంచే క్రమ శిక్షణ, సమాజం పట్ల అవగాహన, దేశ భక్తి నేర్పుతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు స్కౌట్ దుస్తులు, క్యాప్ అందజేశారు. ఎస్‌ఐ చిన్న బలరామయ్య, గునపాటిపాళెం వైద్యుడు రామాంజనేయులు, స్కౌట్ మాస్టర్, ఫిజికల్ డైరెక్టర్ పిడుగు భరత్ మహిపతి, టీచర్లు సీతారామయ్య, పెంచలయ్య, శివప్రసాద్, భారతి, రేణుక, ప్రసన్న, ఝాన్సీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధినేతను కలిసిన నేతలు




జగన్‌కు స్వాగతం పలుకుతున్న నేదురుమల్లి, అనిల్‌కుమార్‌రెడ్డి, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరులో పర్యటన సందర్భంగా హెలీప్యాడ్ వద్ద ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డిని జగన్‌మోహన్‌రెడ్డికి పరిచయం చేశారు.

పెళ్లకూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు పర్యటనకు విచ్చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిజేయశారు. ఆయన వెంట ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం పాల్గొన్నారు.

అందరికీ కృతజ్ఞతలు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతంపై మాజీ ఎమ్మెల్యే స్పందన


మాట్లాడుతున్న సంజీవయ్య

నాయుడుపేట టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనలో పోలీసులు ఎన్ని అడ్డంకులు పెట్టినా ప్రజలు విజయవంతం చేశారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఇతర నాయకులతో కలిసి గురువారం సాయంత్రం మాట్లాడారు. నెల్లూరులో జరిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి పోలీసులు పెట్టిన ఆంక్షలను లెక్క చేయకుండా పాల్గొని, తమ అభిమానాన్ని చాటి చెప్పారన్నారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు అత్యుత్సాహం చూపి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను సైతం అడ్డుకుని దుర్మార్గంగా వ్యవహరించారని తీవ్రంగా విమర్శించారు. సంజీవయ్యతోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెళ్లకూరు ఎంపీపీ శేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకం జయరామయ్య, నాయకులు షేక్ షబ్బీర్, తన్నమాల రమణయ్య తదితరులు ఉన్నారు.

కుట్టు శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగం


రాపూరులో కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి

రాపూరు: టైలరింగ్‌లో మహిళలకు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరమని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి అన్నారు. ఆమె గురువారం రాపూరు పాత ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న టైలరింగ్ శిక్షణను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ టైలరింగ్ నేర్చుకుంటే ఒకరిపై ఆధార పడకుండా జీవించవచ్చన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తుందని, వాటి ద్వారా బ్యాంకులో రుణాలు పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ 90 రోజులపాటు శిక్షణ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ దశరథరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ట్రైనర్ షబ్బు, ఆపరేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం తనిఖీ

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలో మహిళలకు టైలరింగ్‌లో ఇస్తున్న శిక్షణను గురువారం బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.నిర్మలాదేవి తనిఖీ చేశారు. టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భవాని, బీసీ కార్పొరేషన్ సీనియర్ సహాయకురాలు అలేఖ్య, మండల పరిషత్ సీనియర్ సహాయకుడు ఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

కృష్ణంరాజుకు సన్మానం


కృష్ణంరాజును సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఓజిలి: మండల పరిధిలోని ఆర్మేనిపాడు యూనియన్ బ్యాంక్‌లో సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గుంటమడుగు కృష్ణంరాజు, ప్రమీల దంపతులను సిబ్బంది గురువారం శాలువాలతో సన్మానించారు. కృష్ణంరాజు బ్యాంకులో ఉద్యోగ విరమణ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎస్.సుధాకర్, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్ర రాజు, ఉప సర్పంచ్ సుకుమార్‌రాజు, విద్యా కమిటీ చైర్మన్ వెంకటసుబ్బరాజు, షేక్ అజ్మతుల్లా, ఈశ్వర్ రాజు, మధుసూదన్‌రాజు, పెద్దసంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సేవలు సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి రూరల్ : లేఔట్ రెగ్యులేజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) పథకాన్ని పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. అనధికారిక లేఔట్లను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని తెలిపారు. 2025 జూన్ 30కి ముందు అనధికారిక లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఉంటే ఈనెల 26వ తేదీ నుంచి 90 రోజుల పాటు వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రస్తుత రిజిస్ట్రేషన్ ప్రకారం 14 శాతం చార్జీలతో రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. సచివాలయం కార్యదర్శులు, ఇంజినీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు.

గుండెపోటుతో అటవీశాఖ బేస్ క్యాంప్ వాచర్ మృతి

వెంకటగిరి రూరల్ : అటవీశాఖ బేస్ క్యాంప్ వాచర్‌గా పనిచేస్తున్న వెంకటగిరి మండలం పాళెంకోటకు చెందిన తిరుమలశెట్టి చెంచయ్య (65) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు..తిరుమలశెట్టి చెంచయ్య బుధవారం పాళెంకోట, వెలుగొండ అడవుల్లో బేస్ క్యాంప్ వాచర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుండెపోటు వచ్చింది. గమనించిన స్థానికులు, కుటుంబం సభ్యులు వెంకటగిరికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజర్ రమణయ్య, అటవీశాఖ సిబ్బంది పాళెంకోటలోని చెంచయ్య నివాసం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా చెంచయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని అధికారులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


శిరీషను అభినందిస్తున్న టీచర్లు

కోట: కోట ఎంఈఓ-1గా జి.శిరీష గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెళ్లకూరు నుంచి కోటకు బదిలీపై వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు ఆమెను కలిసి అభినందించారు.

కొత్త నిబంధనలు పాటించాలి

చిల్లకూరు: ఉపాధి పథకం కింద ఇకపై కొత్త నిబంధనలు పాటిస్తూ పనిచేయాల్సి ఉంటుందని ఏపీఓ గిరిబాబు సూచించారు. మండల ఉపాధి కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ఆగస్టు 7వ తేదీ నుంచి ముఖ ఆధారిత గుర్తింపును తీసుకొస్తుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రం నుంచి పీడీ శ్రీనివాసప్రసాద్ ద్వారా గ్రూప్ కాల్ మాట్లాడించి నిబంధనలు తెలియజేశారు.

ఆక్రమణలపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి విచారించారు. సాక్షి దిన పత్రికలో గురువారం 'నెలబల్లిలో ఆక్రమణల పర్వం' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో తహశీల్దార్ శైలకుమారి స్పందించారు. సంబంధిత వీఆర్‌ఓ రమేష్, సర్వేయర్‌ను ఆక్రమణలపై విచారణ నిమిత్తం పంపారు. తొలుత నెలబల్లి గ్రామ సమీపంలో మాలగుంట చెరువు పొరంబోకు భూమిని పరిశీలించారు. సర్వే చేసి మాలగుంట చెరువు హద్దులు ఏర్పాటు చేసిన తరువాత పట్టా భూములను చదును చేసుకోవాల్సిందిగా సంబంధిత వ్యక్తులకు వీఆర్‌ఓ తెలియజేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా వివిధ సర్వే నంబర్లలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కూడా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

స్కూల్ లైబ్రరీ అసిస్టెంట్‌కు సన్మానం


కృష్ణజ్యోతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కలువాయి(సైదాపురం) : కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన గంగపట్నం కృష్ణజ్యోతిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్డీ అబ్బాస్ ఆలీ, సీహెచ్ మల్లికార్జున్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ జి.పెంచల పుల్లయ్య మాట్లాడుతూ కృష్ణజ్యోతి 26 ఏళ్లుగా విశేష సేవలు అందించారని తెలిపారు. అదేవిధంగా గతంలో పాఠశాలలో పని చేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, అల్లాబక్షు, సీఎంఆర్డీ మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓగా కొండయ్య


కొండయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దొరవారిసత్రం: ఎంఈఓ-1గా కోలా కొండయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీవీ సత్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కృష్ణయ్య, సంఘాల నేతలు పాల్గొన్నారు.